క్లుప్తంగా

గిరిజన ఆశ్రమాల్లో సమస్యలు పరిష్కరించాలి



ఐటీడీఏ ఏపీవో పి.మురళీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్

పార్వతీపురం టౌన్: గిరిజన ఆశ్రమాల్లో సమస్యల పరిష్కరించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఐటీడీఏ ఏపీవో పి.మురళీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న పార్వతీపురం మండలం రావికోన గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తాగడానికి మంచి నీటి సదుపాయం కల్పించాలన్నారు. విజయనగరం ఉమ్మడి జిల్లా మెంటాడ మండలం ఆంద్ర గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులు చదువుకోవడానికి తరగతి గదులు లేక వసతి గృహాల్లో ఇబ్బందులు పడుతున్నారని అదనపు భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతానగరం: మండలంలోని వీఆర్‌ఏలు దీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ డివిజన్ నాయకుడు జి.వెంకటరమణ అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు వీఆర్‌ఏలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్య లు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు వి.సూరయ్య, కిషోర్, అశిరమ్మ, శంకరరావు ,ఆర్‌ఆనందరావుల ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన పాలకులు అధికారం చేపట్టిన తరువాత సమస్యలు గాలికి వదిలేశారని ఆరోపించారు. వీఆర్‌ఏకు పదోన్నతి కల్పించి వీఆర్వోగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో చిట్టెమ్మ,బి గురువులు, లక్ష్మి పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్‌వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



డాక్టర్ అజయ్‌కు వినతిపత్రం అందిస్తున్న హెల్త్ వర్కర్లు

సాలూరు రూరల్: మండలంలోని కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తోణాం పీహెచ్‌సీ డాక్టర్ అజయ్ కుమార్‌కు మండల హెల్త్ వర్కర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకురాళ్లు వరలక్ష్మి, గౌరీశ్వరి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న హెల్త్ వర్కర్లకు టార్చిలైట్, రెయిన్ కోటు, మెడికల్ కట్లు, గొడుగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల హెల్త్‌వర్కర్లు పాల్గొన్నారు.

యాదవవీధిలో అన్నసమారాధన



యాదవవీధిలో కార్యక్రమం

మక్కువ: స్థానిక యాదవవీధిలో మంగళవారం వినాయకచవితి మహోత్సవాల సందర్భంగా కమిటీసభ్యులు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. మక్కువలోని పలువీధులకు చెందిన భక్తులు అన్నసమరాధన కార్యక్రమంలో పాల్గొని, స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే గ్రామాలలో వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని కమిటీసభ్యులు, యువత జరిపించారు.

25 మందిపై బైండోవర్

సాలూరు: వినాయక నిమజ్జనాల నేపథ్యంలో డబ్బివీధి, వడ్డివీధికి చెందిన 25 మందిని బైండోవర్ చేసినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారిని తహసీల్దార్ వద్ద ప్రవేశపెట్టామన్నారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఒక్కొక్కరికి రూ.2 లక్షల జరిమానా విధించనున్నట్లు తెలిపారు. అందరూ ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జన ఉత్సవాలు జరుపుకోవాలని హితవు పలికారు.

మరణం లేని మహానాయకుడు

- ప్రజల గుండెల్లో వైఎస్సార్ స్థానం సుస్థిరం
- దివంగత వైఎస్సార్‌కు ఘనంగా నివాళి అర్పించిన మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సాలూరు: వైఎస్సార్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సీతానగరం: మండలకేంద్రంలో రాజన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పార్టీ ప్రముఖులు

సాలూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని, భౌతికంగా ఆయన దూరమైనా ప్రజల్లో మరణం లేని మహానాయకుడు వైఎస్సార్ అని, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కొనియాడారు. వైఎస్సార్16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం సాలూరు పట్టణంలోని వైఎస్సార్ కూడలి వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి, చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు పేదలకు పండ్లు పంపిణీ చేవారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీతో ప్రజలు గుండె చప్పుడుగా వైఎస్సార్ మారారని, ఈ పథకం పలు దేశాల్లో అమలుకు వైఎస్సార్ ప్రేరణగా నిలిచారని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచారని గుర్తుచేశారు. రైతు రుణ మాఫీ, పంటలకు ఉచిత కరెంట్ అందించిన రైతు బాంధవుడు వైఎస్సార్ అని అన్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజ్‌రియింబర్స్ మెంట్ వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలు ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి గొప్ప చదువులు చదివారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ,104,108 వంటి గొప్ప కార్యక్రమాల ద్వారా రాజశేఖర్‌రెడ్డి ఎందరికో ప్రాణాలు పోశారన్నారు. రాష్ట్రంలో తొలిసారి జలయజ్ఞంలో భాగంగా సాలూరు నియోజకవర్గంలో పెద్దగెడ్డ రిజర్వాయర్‌ను నిర్మాణం పూర్తిచేసి జాతికి అంకితం చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు,అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం రూరల్: ఎమ్మార్‌నగరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న స్థానిక యువకులు, పార్టీ నాయకులు



బలిజిపేట: మిర్తివలసలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, ప్రజలు



పార్వతీపురం రూరల్: నర్సిపురంలో పూలమాలలు వేసి జోహార్ వైఎస్సార్ అంటూ నివాళులు అర్పిస్తున్న స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులు



బలిజిపేటలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

సంక్షేమపాలనలో రాజముద్ర



వైఎస్సార్ కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం రూరల్: సంక్షేమ పాలనను అందించి తెలుగు ప్రజల గుండెల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాజముద్ర వేసుకున్నారని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. వైఎస్సార్ 16వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో గల వైఎస్సార్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే రైతు బజార్ సమీపంలో ఉన్న నిరాశ్రయుల భవనంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కానీ, జిల్లాలో కానీ ఉన్న ప్రాజెక్టులను చూస్తుంటే వైఎస్సారే గుర్తుకు వస్తారని, అలాగే బలహీన వర్గాలకు ప్రభుత్వ పాలనను దగ్గర చేసి సంక్షేమాన్ని పేదవాడికి అందించిన మహనీయుడు డా. వైఎస్ఆర్ అని కొనియాడారు. ఆయన ఆలోచనలు, ఆశయాలను వైఎస్సార్ తనయుడు వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్ రెడ్డి కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు యిండుపూరు గున్నేశ్వరరావు, కొండపల్లి రుక్మిణి పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బలగ శ్రీరాములు నాయుడు, ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, టి.ప్రసాద్, ఎంపీపీలు గుడివాడ నాగమణి, మజ్జి శోభారాణి, జెడ్పీటీసీలు అలజంగి రవికుమార్, మామిడి బాబ్జీ, బలగ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు సిద్దా జగన్నాథం, వెలిది సాయిరాం, బంకూరు రవికుమార్, రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ స్థాయి అనుబంధ విభాగాల నాయకులతో పాటు వివిధ వార్డుల కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ మండల కమిటీల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సాలూరు రూరల్: మామిడిపల్లిలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ సువ్వాడ శశికళ, మహిళలు



మక్కువ: కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

ఎరువులకోసం రైతుల పాట్లు

- తామరఖండిలో పోలీసుల సమక్షంలో పంపిణీ

సీతానగరం: మండలంలో ఎరువుల కొరతతో ఆందోళన చెందుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తామరఖండి గ్రామానికి మంగళవారం యూరియా వచ్చింది. రైతులకు ఎరువులు అవసరమై పదిరోజులుగా కాళ్లరిగేలా తిరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఎరువులు వేయకపోతే పంటదిగుబడిపై ప్రభావం పడుతుందన్న భయంతో ఎరువులు వస్తాయని ఎదురుచూసిన రైతులకు మంగళవారం ఎరువులు పంపిణీ చేయడం ప్రారంభించారు. అయితే తక్కువ ఎరువు వచ్చిందని తెలుసుకున్న రైతులు పాస్ పుస్తకం, ఆధార్ కార్డులు చేతపట్టుకుని ఒక్కసారిగా పెద్దసంఖ్యలో చేరుకోవడంతో తోపులాటకు దారితీసింది. దీంతో వ్యవసాయాధికార సిబ్బందితో రైతు సేవా కేంద్రం వద్ద గలాటా జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై ఎం.రాజేష్ రైతు సేవాకేంద్రానికి సిబ్బందితో చేరకుని ఎరువులు సక్రమంగా పంపిణీ చేస్తామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.



రైతులను సముదాయిస్తున్న ఎస్సై ఎం. రాజేష్

టీఎల్ఎంతో బోధన ఉపయోగకరం

బలిజిపేట: టీఎల్ఎంను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు బోధన అందించడం ఎంతో ఉపయోగకరమని ఎంఈఓ-1సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పలగర మోడల్ ప్రైమరీ పాఠశాలను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. విద్యార్థులకు టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్‌తో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. దీనివల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, వారిలో మెమరీ పవర్ పెరుగుతుందన్నారు. విద్యార్థులతో మమేకమై బోధనా పరికరాలను వినియోగించి విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయుల తీరును ప్రశంసించారు. అదేవిధంగా విద్యార్థుల ఆంగ్ల, తెలుగు పుస్తకాల పఠన విధానాన్ని పరిశీలించారు. రాత, చదువుపై దృష్టిసారించాలని సూచించారు. మంచి చేతిరాత ఉండేవిధంగా చూడాలని చెప్పారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉన్నందున విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. బడితోట ద్వారా కూరగాయల మొక్కలు పెంచాలని కోరుతూ మధ్యాహ్నభోజన పథకం అమలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పలగర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను పరిశీలిస్తున్న ఎంఈఓ-1సామల

రేషన్ బియ్యం కోసం గిరిజనుల పాట్లు



తలపై రేషన్ బియ్యం బరువుతో గ్రామాలకు బయలు దేరిన గిరిజన మహిళలు

పార్వతీపురం రూరల్: అక్కడి గిరిజనులకు రేషన్ బియ్యం కావాలంటే పొద్దున్నే 4గంటలకు తమ గ్రామాల నుంచి పంచాయతీ కేంద్రాలకు బయలు దేరాల్సిందే. పనులు మానుకుని ప్రభుత్వం ఇస్తున్న బియ్యం కోసం కిలోమీటర్ల మేర నడవాల్సిన దుస్థితి అక్కడ గిరిజన ప్రజలది. తీరా పంచాయతీ కేంద్రాల్లో ఉన్న రేషన్ డిపోలకు వెళ్లి బియ్యాన్ని సేకరించి ఆ బరువును కాస్త నెత్తిపై మోసుకుంటూ మళ్లీ కిలోమీటర్ల మేర చెట్టు, పుట్ట, గట్టులు దాటుకుంటూ గ్రామాలకు చేరుకోవాలని పార్వతీపురం మండలంలోని ములగ పంచాయతీ, గంగాపురం పంచాయతీలకు చెందిన గిరిజనులు ప్రభుత్వం తీరుపట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తమ గ్రామాల వద్దకే రేషన్‌ను పంపిణీ చేసేవారని ఇప్పుడు కూటమి ప్రభుత్వం రద్దుచేయడంతో అనేక అవస్థలు పడాల్సివస్తోందని స్థానిక సీపీఎం నాయకుడు పి.రాము వద్ద గిరిజనులు వాపోయారు.

కనులపండువగా వినాయక కల్యాణం



నిర్వహిస్తున్న పూజలు

సాలూరు: వినాయక నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పట్టణలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో లక్షపత్రి పూజ, వినాయక కల్యాణం, విఘ్నేశ్వర హోమం తదితర కార్యక్రమాలు కనులపండువగా మంగళవారం నిర్వహించారు.పండితుడు హేమంత్ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు 22 మంది దంపతులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బంగారి దొర మృతిలో గ్రానైట్ కంపెనీ పాత్ర

- ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి



పార్వతీపురం రూరల్: మండలంలోని వెలగవలస చెరువును గ్రానైట్ బూడిదతో నింపేసి, గ్రానైట్ కంపెనీయే పాడి బంగారు దొరను చంపేసిందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నడిమి ములగ వాస్తవ్యుడు పాడి బంగారు దొర వలవేసి చేపలు పట్టుకుంటూ గడిచిన 25 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాడని ఎప్పటిలాగానే గత నెల 30న నలుగురితో కలిసి వెలగవలస బడిదేవరమ్మ చెరువుకు చేపల వేటకు వెళ్లాడని చెరువులో దిగగానే జారిపోయి మునిగిపోతున్న సమయంలో గట్టుమీద ఉన్న మరో వేటగాడు బంగారు దొరను కాపాడాలని చెరువులోకి దిగబోయి ప్రమాదం అర్థమై వెనక్కి తగ్గడంతో, బంగారు దొర మునిగిపోయి చనిపోయాడన్నారు. తమ కళ్లముందే తోటి వ్యక్తి అలా కావడంతో ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితిలో పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు.

ఈ మేరకు పోలీసులు వచ్చి చెరువు గట్టును తొలగించి నీరు పోయిన అనంతరం చెరువులో చూస్తే మృతిచెందిన బంగారు దొర రాతి బూడిదలో కూరుకుపోయి దిగిన వాడు దిగినట్లే శవమై ఉన్నాడని పోలీసుల నివేదికలో పొందుపరిచారన్నారు. ఈ మేరకు బంగారు దొరను చంపేసింది ఈ చెరువు కాదని, గ్రానైట్ కంపెనీయేనని కృష్ణమూర్తి వాపోయారు. తక్షణమే కొండపై గ్రానైట్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను రద్దుచేయాలని, మృతుని కుటుంబానికి రూ.50లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కృష్ణమూర్తి డిమాండ్ చేశారు.

స్వమిత్వ సర్వే సమగ్రంగా నిర్వహించాలి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్న స్వమిత్వ సర్వే సమగ్రమైన సమాచారంతో చేపట్టాలని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్, తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఇప్పలవలసలో సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు, కార్యదర్శుల ద్వారా జరుగుతున్న స్వమిత్వ సర్వే పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పలవలస గ్రామంలో ప్రభుత్వస్థలాలు, ప్రైవేట్ స్థలాలు, పర్మినెంట్, తాత్కాలిక కట్టడాలు వాణిజ్యపరంగా నిర్వహించే కట్టడాలను పరిశీలించాలని ఇంటింటికీ వెళ్తున్న ఇంజనీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శి, సర్వే సహాయకులకు సూచనలు ఇచ్చామన్నారు. ఇళ్లకు సంబంధించిన పొడవు- వెడల్పు, భవనానికి సంబంధించిన బుక్‌వేల్యూ, ప్రస్తుతం ఉన్న ఇంటి విలువలను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ, మండల సర్వేయర్, విలేజ్ సర్వేయర్, గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ ప్రసన్నకుమార్, డిప్యూటీ ఎంపీడీఓ కె. కుమార వర్మ

నీరుగారిన తాగునీటి ఆశలు

- ఎప్పటికప్పుడే మోటార్లకు రిపేరు

పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీకి తాగునీటి సరఫరా తీరుతెన్నులు చూస్తుంటే తాగునీటి ఆశలు నీరుగారినట్లేనని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం మున్సిపాలిటీకి తాగునీరు అందించే తోటపల్లి వద్ద గల నాగావళి నది హెడ్ వాటర్ వర్క్స్‌ను, నీరు తోడే మోటార్లను, మూలన పడిన జనరేటర్‌ను, నీటి సంపులను, నదిలోని ఇన్‌ఫిల్టరేషన్ బావులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ తాగునీరు అందించే పద్ధతి చూస్తుంటే అధికారులు, పాలకుల్లో చిత్తశుద్ధి కొరవడినట్లు కనిపిస్తోందన్నారు. నిత్యం మోటార్లు మరమ్మతుల బారిన పడడం, కరెంటు సక్రమంగా సరఫరా లేకపోవడం, ఉన్న జనరేటర్ పనిచేయకపోవడం తదితర సమస్యలన్నీ కర్ణుడి చావుకు అన్న చందంగా..ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సాలూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గేదెల రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



బస్టర్ పంప్‌హౌస్‌లో తాగునీటి సరఫరాను అడిగి తెలుసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రెండోరోజుకు చేరిన అంగన్వాడీల రిలే నిరాహారదీక్షలు

పార్వతీపురం రూరల్: అర్హత కలిగిన అంగన్వాడీ హెల్పర్లకు జీఓనంబర్ 2 ప్రకారం వర్కర్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన అధ్యక్ష, కార్యదర్శులు ఉమామహేశ్వరి, జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే భవిష్యత్‌లో తాము పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించేంతవరకు ఉద్యమాలు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురం టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించేంతవరకు ఉద్యమాలు తప్పవని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ అన్నారు. రాష్ట్ర విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 6 న చలో విజయవాడ కార్యక్రమానికి విద్యార్థులందరూ కదలి రావాలని మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఎస్ఎఫ్ఐ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు తీవ్ర ద్రోహం తలపెట్టిందని విమర్శించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించారని, చంద్రబాబు తల్లికి వందనంలో అనేక షరతులు పెట్టి 60 వేలమంది తల్లులను పథకానాకి దూరం చేశారన్నారు. నూతన విద్యా విధానంలో సరళమైన మార్పులు తీసుకువచ్చి విద్యారంగంలో గందరగోళం సష్టిస్తున్నారన్నారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజురీయింబర్స్ మెంట్ నిధులు విడుదల చేయాలి. జీఓ నం:77ను రద్దు చేసి పీజీ విద్యార్థులందరికీ ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి. పార్వతీపురం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం కేంద్రాల్లో పీజీ సెంటర్లు ఏర్పాటు చేయాలి. పార్వతీపురం కేంద్రంలో మెడికల్ కళాశాల పనులు పూర్తి చేయాలి. హాస్టల్ విద్యార్థులకు రూ.3 వేలు మెస్ బిల్లులు పెంచాలి. హాస్టల్స్ అభివద్ధికి నిధులు కేటాయించాలి. ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి. యూనివర్సిటీలలో అధ్యాపక పోస్టులు, ఖాళీ వీసీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.అనిల్, టి.అఖిల్, జిల్లా సహాయ కార్యదర్శి బి.గంగారాం, జిల్లా కోశాధికారి కె.డేవిడ్, జిల్లా ఉపాధ్యక్షులు సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు సురేష్, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.